క్లుప్తంగా

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

ఎమ్మెల్యే కాలె యాదయ్య



సిబ్బందికి సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే

శంకర్‌పల్లి: మిషన్ భగీరథ సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మంచినీటి సిబ్బంది శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం వారికి సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సిబ్బంది నీటిని పొదుపుగా వాడుతూనే, గ్రామస్తుల అవసరాలను తీర్చాలని సూచించారు. విధి నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా ఉన్నతాధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకయ్య, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ మేనేజర్

కొందుర్గు: మండలంలోని విశ్వనాథ్‌పూర్ గ్రామంలో కొందుర్గు యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి గ్రామంలో శ్రమదానం చేసి పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్ మాట్లాడుతూ.. పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, గ్రామస్తులు మల్లయ్య, మాచిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాజానర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియామకం



చంద్రశేఖర్‌రెడ్డికి యామకపత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు యాదిశ్

మొయినాబాద్‌రూరల్: బీజేవైఎం చేవెళ్ల అసెంబ్లీ కన్వీనర్‌గా కేతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు టి.యాదిశ్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదిశ్ మాట్లాడుతూ.. బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడిగా ఉన్న దారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చేస్తున్న పనిని గుర్తించి అసెంబ్లీ కన్వీనర్‌గా నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ నిర్వహిస్తున్న సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రతి నాయకుడికి గుర్తింపు వస్తుందన్నారు. అనంతరం దారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు టి.యాదిశ్‌తో పాటు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు మాదపురం శ్రీకాంత్, జిల్లా కన్వీనర్ కందికొండ ప్రశాంత్‌గౌడ్, రాజమల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీలో సత్తా చాటిన ప్రసన్న



కేశంపేట: మండల పరిధిలోని సంతాపూర్‌కు చెందిన ప్రసన్న ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో జిల్లా 4వ ర్యాంకును సాధించినట్టు గ్రామస్తులు తెలిపారు. బాలరాజ్, మంజుల దంపతుల కూతురు ప్రసన్న చదువు మొత్తం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే కొనసాగింది. ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టుకు సొంతంగా ప్రిపేర్ అయి సెకండ్ గ్రేడ్ టీచర్‌గా జిల్లాస్థాయిలో నాలుగో ర్యాంకు సాధించిందని పేర్కొన్నారు. ప్రభుత్వ బడుల్లో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవడంపై మండల విద్యాధికారి చంద్రశేఖర్‌తో పాటు కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, పీఆర్టీయూ మాజీ మండల అధ్యక్షుడు శ్రీనివాససాగర్, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రతిపక్షాల నాటకాలు నమ్మరు

తుక్కుగూడ: రాష్ట్రంలో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు రెండు కలిసి నాటకం మొదలుపెట్టాయని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీజేపీ పరిపాలన చేస్తున్న ఏ రాష్ట్రంలోనైన రైతులకు రుణమాఫీ చేసిందా అని ప్రశ్నించారు?. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తుందన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు రాష్ట్రంలో చేస్తున్న హైడ్రామాను ప్రజలు నమ్మలేరన్నారు. ఇప్పటికైనా వారి వైఖరిలో మార్పు తెచ్చుకోవాలన్నారు.

పూల పండుగకు వేళాయె

- నేటి నుంచి బతుకమ్మ సంబురాలు
- ఆటపాటలకు సిద్ధమైన మహిళలు
- ఎంగిలిపూలతో మొదలై సద్దులతో ముగింపు



షాబాద్‌లో మహిళలు తయారుచేసిన బతుకమ్మలు(ఫైల్)

షాబాద్: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ. ఈ పండుగ వచ్చిందంటే పల్లె, పట్టణం తేడా లేకుండా పూల పరిమళాలు వెదజల్లుతాయి. గునుగు, తంగేడు, పట్టుకుచ్చులు, బంతి, చామంతి, రుద్రాక్ష, గోరింట ఇలా తీరొక్క పువ్వు బతుకమ్మను ఆహ్వానిస్తుంది. తెలంగాణ ప్రజలు ఎంతో ఆడంబరంగా జరుపుకునే బతుకమ్మ పండుగ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఎంగిలిపూలు మొదలు సద్దులవరకు ఆడబిడ్డలు తొమ్మిది రోజులపాటు బతుకమ్మను ఆటపాటలతో కొలుస్తారు. పంటలు, ప్రజలు, గొడ్డుగోదా బాగుండాలని కోరుకుంటారు.

ఇదీ పండుగ చరిత్ర..

పూర్వం ధర్మాంగుడు అనే రాజు ఉండేవాడని, అతని భార్య సత్యవతికి వంద మంది కొడుకులు పుట్టినవారు పుట్టినట్లే చనిపోయారు. దంపతులిద్దరూ లక్ష్మీదేవి పూజ నిర్వహిస్తారు. వారికి చివరకు ఒక ఆడపిల్ల పుట్టింది. ఆమెను బతికించుకోవడానికి లోకమాత అయిన దుర్గాదేవికి శరన్నవరాత్రుల పేరిట పూజలు నిర్వహిస్తారు. అప్పటివరకు ఆమెకు పేరు పెట్టకుండా ఉండి ఆ బిడ్డ బతకాలని అందరూ ఆమె పేరు బతుకమ్మ అని పెట్టారు. అప్పటి నుంచి క్రమంగా ఆ పాప పేరు బతుకమ్మగా మారింది. అప్పటి నుంచి లక్ష్మీదేవిగా నామకరణం చేసిన అందరూ బతుకమ్మగానే పిలుస్తారు. ఆ మహారాజు కూతురు ఎక్కడికి వెళ్లినా.. ఎవరింట్లో అడుగు పెట్టినా లక్ష్మీ దేవి తండావిస్తోంది. అప్పటి నుంచి బతుకమ్మ పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారని పూర్వీకులు వివరించారు.

ఒక్కో రోజు ఒక్కో పేరుతో..

తొలిరోజు బతుకమ్మను ఎంగిలిపూల బతుకమ్మ అంటారు. ముందురోజు కోసిన పూలను నీళ్లలో వేసి, మరునాడు అలంకరణకు వాడటంతో ఇలా పిలుస్తారు. రెండోరోజు అటుకుల, మూడో రోజు ముద్దపప్పు, నాలుగో రోజు నానబియ్యం, అయిదో రోజు అట్ల, ఆరో రోజు అమ్మవారు అలకలో ఉంటుందని నమ్మి బతుకమ్మ ఆడరు. ఏడోరోజు వేపకాయల, ఎనిమిదో రోజు వెన్నముద్దల, తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ అంటారు. చివరిరోజు ఆడబిడ్డలు ఆడిపాడి, పోయిరా బతుకమ్మ పోయిరావమ్మా.. మళ్లొచ్చే ఏడాది తిరిగి రావమ్మా.. అని వీడ్కోలు పలుకుతారు. నీళ్లలో నిమజ్జనం చేశాక వాయినం ఇచ్చి పుచ్చుకుంటారు.

ఆడబిడ్డల పండుగ..

బతుకమ్మ పూల పండుగ. ఆడబిడ్డలతో ఊరంతా సందడిగా ఉంటుంది. తొమ్మిది రోజులు రోజొక్క పేరుతో బతుకమ్మ ఆడుతాం. ఎక్కడ ఉన్నా పండుగకి సొంత ఊరికి వెళ్తాం. ఈ పండుగ ప్రకృతిని, దేవుడిని పూజించడంతో పాటు చల్లని శీతాకాలం ప్రారంభాన్ని సూచిస్తుంది. బతుకమ్మ పండుగ మహిళలకు ప్రత్యేకంగా ఉండడం మా అదృష్టం.

– జడల లక్ష్మి, షాబాద్

ఇంటి దేవతగా కొలుస్తాం..

తెలంగాణ ఆడబిడ్డల పండుగ బతుకమ్మ. బొడ్డెమ్మ మొదలు సద్దుల బతుకమ్మ వరకు రోజుకో ప్రత్యేకత ఉంది. బతుకమ్మను ఇంటి దేవతగా కొలుస్తాం. నా చిన్నప్పటి నుంచి మా ఇంట్లో అమ్మమ్మ, అమ్మ అక్కలతో కలిసి బతుకమ్మను అలంకరించడం, అందులో నైపుణ్యాన్ని ప్రదర్శించడం చాలా సంతోషంగా ఉంటుంది. పోటాపోటీగా బతుకమ్మను పేరుస్తాం. ఈ పండుగ మనకు నైతిక విలువలను కూడా అలవాటు చేస్తుంది.

– అరుణ, బోడంపహాడ్, షాబాద్

పువ్వులను కీర్తిస్తూ..

బతుకమ్మ పాటల్లో కష్టసుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు, భక్తి ఉంటుంది. రకరకాల పువ్వులు రంగు రంగులలో పూసి ఉంటాయి. వీటిలో గునుగు, తంగేడు పూలు ఎక్కువగా పూస్తాయి. బంతి, చామంతి, పూలకు కూడా ఇదే సమయం, ఆడపడుచులు ప్రకృతి సౌందర్యాన్ని అద్భుతమైన రంగురంగుల పువ్వులతో కీర్తిస్తూ పండుగను జరుపుకుంటారు. బతుకమ్మ పండుగ తెలంగాణలో సౌందర్యం, ఆత్మగౌరవం పెంపొందిస్తుంది.

– జ్యోతి, కక్కులూర్, షాబాద్

స్కూళ్లను అభివృద్ధి చేసుకుందాం

బీజేపీ ఓబీసీ జిల్లా కార్యదర్శి వెంకటేశ్‌గౌడ్



విద్యార్థులకు ఫుట్‌బాల్ కిట్ అందజేస్తున్న వెంకటేశ్‌గౌడ్

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకునేందుకు అందరం కృషి చేద్దామని బీజేపీ ఓబీసీ జిల్లా కార్యదర్శి ఎలిగని వెంకటేశ్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బాకారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆయన క్రీడా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో పాల్గొనాలని సూచించారు. అనంతరం మాజీ సర్పంచ్ బద్దుల సుధాకర్‌యాదవ్ మాట్లాడుతూ.. అక్షరాస్యతలో బాకారం గ్రామం రాష్ట్రపతి అవార్డు పొందిందన్నారు. చదవడం, రాయడంలో గ్రామంలో రాత్రి పూట బడులు ఎంతో చక్కగా కొనసాగాయని పేర్కొన్నారు. అదేవిధంగా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉన్నత విద్యలో రాణిస్తూ రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. విద్యార్థులకు వాలీబాల్ కిట్, టీ షర్ట్స్, నెట్‌సెట్, ఫుట్‌బాల్ వివిధ క్రీడలకు సంబంధించిన సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఎలిగని భిక్షపతిగౌడ్, కొండా శేఖర్‌గౌడ్, యాదయ్యగౌడ్, ఎలిగని శ్రీకాంత్‌గౌడ్, కొమ్మిడి రాజేందర్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

శంకర్‌పల్లి: రాష్ట్రంలోనే మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం స్వచ్ఛతా హీ సేవ 2024–2025లో భాగంగా 11వ వార్డులో స్వచ్ఛతపై అవగాహన సదస్సు, మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో గత 15 రోజులుగా స్వచ్ఛత కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని, దీంట్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావడం సంతోషాన్ని కలిగించిందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనాథ్ గౌడ్, మున్సిపల్ మేనేజర్ అంజన్ కుమార్, పర్యావరణాధికారి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌రూరల్: ఎలికట్టలో..



చేవెళ్లలోని ఓ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు

అంబరాన్నంటిన బతుకమ్మ సంబురాలు

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. పాఠశాలలకు బుధవారం నుంచి సెలవులు ప్రకటించడంతో ముందస్తుగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు రంగు రంగుల పూలతో బతుకమ్మలు తయారుచేసి అందరూ ఒకచోట చేరి పాటలు పాడుతూ ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. సంబురాల్లో విద్యార్థుల నృత్యాలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను చాటేలా బతుకమ్మ వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.



కొత్తూరు: బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న విద్యార్థులు, పాఠశాల సిబ్బంది



షాద్‌నగర్‌రూరల్: బతుకమ్మలతో డిగ్రీ కళాశాల విద్యార్థినిలు, ఉపాధ్యాయురాలు



మొయినాబాద్‌రూరల్: అజీజ్‌నగర్‌లో బతుకమ్మలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు



షాబాద్: హైతాబాద్ ఉన్నత పాఠశాలలో..



షాద్‌నగర్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



చౌదరిగూడలో సంబురాల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్‌లో..



షాబాద్: హైతాబాద్ ఉన్నత పాఠశాలలో..



చేవెళ్ల: పాఠశాలలో బతుకమ్మలతో విద్యార్థులు



షాద్‌నగర్‌రూరల్: పాఠశాలలో సంబురాల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

దైవచింతనతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట: దైవచింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలోని శివాలయంలో శ్రీ కిషన్‌ప్రభు ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో మంగళవారం భగవద్గీత పారాయణం, ప్రచార సమితి కార్యవర్గ ఎన్నిక సమావేశంలో ఎమ్మెల్యే, గంగాపురం ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ పరమాత్మానందగిరిస్వామిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంసార జీవితంలో మనందరం బందిలుగా ఉన్నామని, దైవచింతన ఉంటేనే శాంతి ఉంటుందన్నారు. కిషన్ ప్రభు ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దైవ కార్యక్రమాలు అభినందనీయమన్నారు. దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వం ద్వారా కృషి చేస్తామన్నారు.

భగవద్గీత చదవాలి

ప్రతి హిందూ భగవద్గీత చదవాలని గంగాపురం ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ పరమాత్మానందగిరి స్వామి అన్నారు. హిందువులు ప్రతి ఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలని, హిందూ ధర్మ రక్షణకు కృషి చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో 38 గ్రామాల నుంచి భక్తులు పాల్గొని భగవద్గీత పారాయణం, విష్ణు సహస్రనామం, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్, సురేశ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పల్లె ఆనంద్‌కుమార్, దంగు శ్రీనివాస్, బాలరాజ్‌గౌడ్, కిషన్‌ప్రభు ధర్మ ప్రచార సమితి వ్యవస్థాపకుడు ఉమ్మెంత్యాల మహేశ్వర్, శివరాములు, యుగేంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఇంద్రానగర్ ఉపాధ్యాయులు

కొందుర్గు: షాద్‌నగర్ పట్టణంలో సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్‌స్థాయి క్రీడాపోటీల్లో మండలంలోని ముట్పూర్ విద్యార్థులు వాలీబాల్ అండర్–14 బాలికల విభాగంలో ప్రతిభ చాటి ద్వితీయ బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఆధ్వర్యంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం రాజ్‌కుమార్, పీడీ స్వాములు పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఇంద్రానగర్ గురుకుల పాఠశాల విద్యార్థులు వాలీబాల్ అండర్–14 బాలుర విభాగంలో ప్రతిభచాటి ద్వితీయ బహుమతి అందుకున్నారు. అదేవిధంగా పరుగు పందెంలోనూ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఆధ్వర్యంలో అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, పీడీ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి



స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

మొయినాబాద్: ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతి ఒక్కరూ నిషేధించాలని అప్పోజీగూడ మాజీ సర్పంచ్ గొర్కంటి రాజు అన్నారు. మండల పరిధిలోని అప్పోజీగూడలో గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొని గ్రామంలో ప్లాస్టిక్ నిషేధం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకం అనేక అనర్థాలకు దారితీస్తుందన్నారు. ఇళ్లలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. అదేవిధంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు గ్రామంలో ప్లాస్టిక్ కవర్లు, పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నరేందర్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో నిర్లక్ష్యం వద్దు

మండల ప్రత్యేక అధికారి రాజారత్నం



సమావేశంలో మాట్లాడుతున్న రాజారత్నం

కేశంపేట: గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా మిషన్ భగీరథ సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి రాజారత్నం అన్నారు. మండల పరిధిలోని ఇప్పలపల్లి గ్రామ శివారులోని రైతువేదికలో మంగళవారం గ్రామ పంచాయతీ మంచినీటి సహాయకులకు నాలుగురోజుల శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ తాగునీటి సహాయకులు క్షేత్రస్థాయిలో నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ నీటిని అందించాలని, నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. గ్రామాల్లో ఎలక్ట్రిక్ సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ బోరుమోటార్ల రిపేర్, బోరు పంపుసెట్ల రిపేర్, ప్లంబింగ్, పైపులైన్ లీకేజీ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీఓ కిష్టయ్య, ఏఈలు నాగమణి, ప్రదీప్, ప్రవళిక, ఇప్పలపల్లి పంచాయతీ కార్యదర్శి పాండు పాల్గొన్నారు.

ఫీవర్ సర్వే నిర్వహించాలి

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశకార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మండల ప్రత్యేక అధికారి రాజారత్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ఆశలు గ్రామాల్లో ఫీవర్ సర్వేను నిర్వహించాలని సూచించారు. ఇమ్యూనైజేషన్, ఫ్రైడే డ్రై డే లాంటి కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని ఆయన తెలిపారు. అనంతరం స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ నిఖిత, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

జోనల్ క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



సాయికిరణ్‌ను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని మినీ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జోనల్ స్థాయి క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఇండియన్ హైట్స్ పాఠశాల విద్యార్థులను మంగళవారం పాఠశాల యాజమాన్యం అభినందించారు. అండర్–14 కబడ్డీ బాలికల విభాగంలో తన్విశ్రీ, బాలుర విభాగంలో ఆదర్శ్, ఖోఖో బాలుర విభాగంలో అఖిలేశ్ మొదటి స్థానంలో నిలిచారు. అండర్–17 వాలీబాల్ బాలుర విభాగంలో నిషాంత్‌రెడ్డి ద్వితీయస్థానం సాధించారు. అండర్ –14 వాలీబాల్ విభాగంలో సాయికిరణ్ ఉత్తమ ప్రతిభను కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. క్రీడాపోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ సజ్జల భువనేశ్వర్, ప్రెసిడెంట్ దాక్షాయణి, పాఠశాల డైరెక్టర్లు అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పోటీల్లో ప్రతిభను కనబరిచి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.